క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 45, బెండ 28, పచ్చిమిర్చి 28, కాకర 23, బీర 18, క్యాబేజీ 12, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 35, దొండ 23–28, చిక్కుడు 55, గోకర 23, బీట్‌రూట్ 20, క్యాప్సికం 43, ఆలు 21, దోస 15, సొర 13, పొట్ల 15, ఉల్లిగడ్డ 26, చామగడ్డ 35. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

స్వయం ఉపాధి ఏర్పాటు అభినందనీయం

మలక్‌పేట: నిరుద్యోగ యువత ఉపాధి పొందుతూ పది మందికి ఉపాధి కల్పించడం అభినందనీయమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ సలీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఓ వస్త్ర దుకాణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. యువత కలిసి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్వాహకులు రాఘవేంద్రరావు, ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్ పాల్గొన్నారు.

సైదాబాద్ కొత్త ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన రాఘవేందర్

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సైదాబాద్ ఠాణా కొత్త ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కోరారు. శుక్రవారం ఆయన సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ ఎం.రవిని మూడు రోజుల క్రితం నగర కమిషనర్ ఆకస్మికంగా బదిలీ చేసిన సంగతి విదితమే. దాంతో చాదర్‌ఘాట్ డీఐగా విధులు నిర్వహిస్తున్న రాఘవేందర్‌ను సైదాబాద్ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించండి


మోహన్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వెంటనే చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మోహన్ నగర్ కాలనీలో పర్యటించారు. రోడ్ నెంబర్–1లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. వెంటనే జలమండలి అధికారులు రామకృష్ణారెడ్డి, ఆరిఫ్‌లను అక్కడికి పిలిచి సమస్యను వివరించారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, అనిల్‌కుమార్ , మధు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి నందనవనం కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేరామిట్టీ-మేరాదేశ్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో శుక్రవారం మేరామిట్టీ–మేరాదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వజ్రోత్సవాల్లో భాగంగా దేశం నలుమూలల నుంచి మట్టిని సేకరించి దేశం కోసం అమరులైన వారిని స్మరిస్తూ ఢిల్లీలో స్థూపాన్ని నిర్మిస్తున్నారని అందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన సందడి

- సరూర్‌నగర్ చెరువు వద్ద ప్రస్తుతం ఐదు క్రేన్లతో నిమజ్జనం
- మూడు రోజుల్లో గంగ ఒడికి 150 విగ్రహాలు


సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన దృశ్యం

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద గణేశ్ నిమజ్జన సందడి నెలకొంది. ఇళ్లలో, మండపాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను భక్తులు తీసుకొచ్చి నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జనం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రస్తుతం ఐదు క్రేన్లను అందుబాటులో ఉంచారు. నిమజ్జనం చివరిరోజు నాటికి అదనంగాన మరో మూడు క్రేన్లను అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు. ఇప్పటికే మినీ ట్యాంక్‌బండ్‌పై హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేశారు. మెట్రో వాటర్ బోర్డు ఆధ్వర్యంలో తాగునీటి కౌంటర్లు, తాత్కాలిక మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు. మలక్‌పేట, సైదాబాద్, మాదన్నపేట, హస్తినాపురం, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, నాగోలు పరిసర ప్రాంతాల నుంచి సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్దకు వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలిరానున్నాయి. ఆయా శాఖల ఆధ్వర్యంలో నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీస్, జీహెచ్‌ఎంసీ, ఆరోగ్య శాఖలకు సంబంధించి కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. చివరిరోజు లక్షల మంది సందర్శకులు నిమజ్జనం తిలకించేందుకు వస్తుండటంతో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.


సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్


గణనాథుడిని గంగ ఒడికి చేర్చేందుకు వస్తున్న కాలనీవాసులు

150 విగ్రహాల నిమజ్జనం

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మొదలైన మూడు రోజుల్లో సుమారు 150 విగ్రహాలు (6 అడుగుల పైన) నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు. చివరిరోజు వరకు 1500 నుంచి 2000 వేల విగ్రహాలు నిమజ్జనం జరుగుతాయన్నారు.

ఐదు క్రేన్లు ఉన్నా.. చేతులతో మోసుకెళ్లాల్సిందే!


నిమజ్జనం కోసం విగ్రహాన్ని చెరువు నీటి వరకూ మోసుకెళ్తున్న యువకులు

చైతన్యపురి: ఐదు క్రేన్లు ఏర్పాటు చేసినా విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆరు అడుగుల గణనాథుడి విగ్రహాన్ని మండపం నిర్వాహకులు చేతులతో మోసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేసుకున్న ఘటన సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద జరిగింది.ఉప్పుగూడ శివాజీనగర్ నుంచి కొందరు యువకులు శుక్రవారం తమ విగ్రహాన్ని ఆటో ట్రాలీలో సరూర్‌నగర్ చెరువు వద్దకు తీసుకొచ్చారు. ముందుగా ఒక క్రేన్ దగ్గరకు వెళ్లగా.. పక్క క్రేన్ దగ్గరకు వెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించారు. ఆ క్రేన్ వద్దకు వెళ్లి అరగంటకు పైగా వేచి ఉన్నారు. క్రేన్ డ్రైవర్ అందుబాటులో లేడు..గంటసేపు వేచి ఉండాలి అని అక్కడి సిబ్బంది ఆ యువకులతో అన్నారు. ఎంతకూ క్రేన్‌ను సిద్ధం చేయకపోవటంతో చెరువు చివరకు విగ్రహం ఉన్న ట్రాలీని తీసుకెళ్లారు. చెరువులోకి దిగకుండా అడ్డంగా పెట్టిన ఐదు అడుగుల గ్రిల్‌పైకి విగ్రహాన్ని అతికష్టం మీద చేతులతో లేపి నీళ్ల వైపునకు మోసుకెళ్లి నిమజ్జనం చేశారు. గంట వేచి ఉన్నామని, కనీసం అక్కడ సిబ్బంది స్పందించలేదని యువకులు సూర్యం, విష్ణు తెలిపారు.

మాకు సంబంధం లేదు: జీహెచ్‌ఎంసీ అధికారులు

ఇదే విషయాన్ని సాక్షి ప్రతినిధి అక్కడ కంట్రోల్ రూమ్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమకు సంబంధం లేదని, తమ దగ్గరికి ఆ విగ్రహాన్ని తెచ్చిన వారు వచ్చి ఉంటే ఏం చేయాలనేది ఆలోచించి ఉండేవారమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కాగా, విషయం తెలుసుకున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అక్కడకు వచ్చి క్రేన్ ఆపరేటర్‌ను మందలించారు.

మంత్రి సబితకు చిత్రా లేఅవుట్ కాలనీవాసుల కృతజ్ఞతలు


మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న చిత్రా లేఅవుట్ కాలనీ ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రా లేఅవుట్ కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు శుక్రవారం ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి పి. సబితారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ మాట్లాడుతూ, తమ కాలనీ అభివృద్ధికి మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాలనీలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.90 లక్షలు, డివైడర్‌పై గ్రిల్ ఏర్పాటుకు రూ. 11 లక్షలు, పార్కు సుందరీకరణకు రూ. 8 లక్షల నిధులతో పాటు కాలనీలో ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారని, అందుకే మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు రేగట్టి సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా కృష్ణారెడ్డి, సలహాదారులు మర్రి సత్యనారాయణ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రాఘవ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, కిషోర్ రెడ్డి, శరత్, రామచందర్ రావు, నాగేంద్రయ్య, దివాకర్ రావు, నర్సింగరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కవితకు అభినందనలు



చాదర్‌ఘాట్: మహిళా బిల్లుపై ఎమ్మెల్సీ కవిత పోరాటం ఫలించిందని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ అన్నారు. మహిళా బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో శుక్రవారం ఆమె ఎమ్మెల్సీ కవితను కలిశారు. పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

భారత భాగ్య సమృద్ధి యజ్ఞంలో పాల్గొనండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సహదేవ్‌యాదవ్, మాధవీలత

చంచల్‌గూడ: దేశ ప్రజల శ్రేయస్సు, ప్రపంచ శాంతి కోసం నగరంలోని సీతారాంబాగ్ మందిరంలో 45 రోజుల పాటు నిర్వహించనున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కుర్మగూడలోని హనుమాన్ దేవాలయంలో యజ్ఞం కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. లోపాముద్ర చారిటబుల్ ట్రస్ట్, లతా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాధవీలత కొంపెల్ల పర్యవేక్షణలో వచ్చేనెల 15 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు యజ్ఞం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బర్ల శ్రవణ్‌కుమార్, చవ్వ మహేష్, నర్సింహ, నాగరాజు, కల్యాణ్ తదితరులున్నారు.

ఉద్యోగాలను పర్మనెంట్ చేయండి


నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

మీర్‌పేట: ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మనెంట్ చేయాలని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం భోజన విరామ సమయంలో విధులు బహిష్కరించి శాంతియుత సమ్మె నిర్వహించారు. తమను ప్రభుత్వం పర్మినెంట్ చేయడంతో పాటు పేస్కేల్ అమలు చేయాలన్నారు. స్పందించకపోతే శనివారం నుంచి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది.. శంకరాచారి, జీవన్ కుమార్, వాసుదేవ్, మహేందర్, సత్యనారాయణ, సుధాకర్, బాలకృష్ణ, మహికాంత్, ప్రవీణ్, శివ, పరమేశ్, అంజలి, మాధవి తదితరులు ఉన్నారు.

త్వరలో శివారు కాలనీలకు తాగునీరు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ శివారు ప్రాంతంలోని గడప గడపకూ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జలమండలి కార్యాలయంలో 10ఏ వాటర్ వర్క్స్ మేనేజర్ బలరాం, ఇతర అధికారులతో సమీక్షా సమావేశ నిర్వహించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌తో సమావేశమై తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరగా కొత్తగా 62 కిలో మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారన్నారు. దానితో పాటు మరో 19 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటుకు అధికారులను ఒప్పించామని స్పష్టం చేశారు. త్వరలో 81 కిలో మీటర్ల పొడవుతో తాగునీటి పైప్‌లైన్‌తో పాటు అవసరమైన కాలనీల్లో భూగర్భ డ్రైనేజీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో ఎల్‌బీనగర్ శివారు ప్రాంత కాలనీవాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.

కొలనులో నిమజ్జనం చేయండి: కొప్పుల


మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిమజ్జన కొలనులో గణనాథులను నిమజ్జనం చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. నిమజ్జన కొలను వద్ద నిమజ్జన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పరిసర ప్రాంత కాలనీల ప్రజలు బస్తీల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను పెద్దచెరువులోని కొలనులో నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన కొలను వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. క్రేన్లు ఏర్పాటు చేయటమే కాకుండా విద్యుత్ దీపాలను, తగినంత సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన కార్యక్రమానికి సహకరిస్తున్న వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాతూరి శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో...

వినాయకా.. విజయములివ్వు!


సాహెబ్‌నగర్ వేంకటేశ్వర కాలనీలో బీజేపీ విద్యార్థి రాఘవేంద్ర ధర్మాకోల్‌తో రూపొందించిన గణనాథుడు

కాలనీలు, బస్తీలన్నీ గణపతి నామస్మరణతో మార్మోగుతున్నాయి... జై బోలో గణేశ్ మహరాజ్‌కీ, జై..జైజై గణేశా...జయములివ్వు గణేశా.. అనే పాటలు వినిపిస్తున్నాయి... ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండపాల్లో వివిధ రూపాల్లో కొలువైన గణనాథుడిని స్థానికులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు శుక్రవారం దర్శించుకొని పూజలు చేశారు. కొన్ని మండపాల వద్ద మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. – ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ బృందం


హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం మండపంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు


మన్సూరాబాద్‌లో ప్రత్యేక పూజలు చేసిన బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి


ఎల్‌బీనగర్‌లో.. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి


సైదాబాద్‌లో పూజలు చేస్తున్న లింగాల హరిగౌడ్


త్రివేణి యూత్ అసోసియేషన్ మండపంలో.. లక్ష్మణ్ సింగ్ ఠాకూర్


మండపంలో ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డిలను సన్మానిస్తున్న కె. రాజశేఖర్‌రెడ్డి


గౌతంనగర్‌లోని గణనాథుడిని దర్శించుకున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్


జైపురి కాలనీలోని భాగ్య ఎన్‌క్లేవ్‌లో డ్రస్ కాంపిటీషన్‌లో పాల్గొన్న చిన్నారులు


చిత్రాలేఅవుట్ కాలనీలో.. కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

ఐఎస్‌సదన్ సమగ్రాభివృద్ధికి కృషి


ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధి ఎస్‌ఎన్‌రెడ్డి కాలనీలోని అమ్మవారి ఆలయంలో షెడ్డు నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు తరచూ పర్యవేక్షించాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకపోయినా, నిర్లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నా స్థానికులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి


డివిజన్ అధ్యక్షుడు దినేష్‌కు హెల్త్ కార్డు అందజేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

సైదాబాద్: అందరూ ఆరోగ్యంగా ఉండటానికి మెరుగైన వైద్యసేవలు అందుకోవటమే ఆయుష్మాన్ భారత్ పథకం లక్ష్యమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవ సేవాపక్షంలో భాగంగా శుక్రవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద బీజేపీ భాగ్యనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఆస్మాన్‌ఘడ్, భూలక్ష్మీనగర్ బస్తీలవాసులకు సురేందర్‌రెడ్డి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా లబ్ధిదారులు రూ.5 లక్షల వరకు వైద్యసేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. బస్తీవాసులు తాము ఏర్పాటు చేసిన కేంద్రాల వద్దకు వస్తే ఐదు నిముషాల్లో వారు అందజేసిన వివరాల ఆధారంగా కార్డులు అక్కడికక్కడే ముద్రించి ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మూసారంబాగ్‌లో...

మలక్‌పేట: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డితో కలిసి శ్రీకృష్ణ తులసినగర్‌లో ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి హెల్త్‌కార్డులు అందజేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, వై.సురేందర్, చందు, సందీప్, సంతోష్, వీరేష్, దినేష్, పాల్గొన్నారు.